# ఇసుక ప్రియం..బతుకు భారం

- ఇసుక లోటుతో నాలుగు నెలలుగా దొరకని పని
- పనులకోసం వేలాదిగా తరలివస్తున్న కూలీలు
- పనులకు పిలవక నిరాశతో ఇంటిముఖం పడుతున్న వైనం
- ఇసుక ధర పెరగడంతో పనులు ఆపేసిన యజమానులు



నరసరావుపేట మల్లమ్మసెంటర్‌లో పనుల కోసం వేచిఉన్న కార్మికులు

**నరసరావుపేట:** భవన నిర్మాణ కార్మికుల ఉపాధిని అధికారంలో ఉన్న కూటమి నేతలు దెబ్బతీశారు. సులభంగా దొరికే ఇసుకను ప్రియం చేసి దొరక్కుండా చేశారు. దీంతో వేలాది మంది కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఇసుక ఫ్రీ పేరుతో ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఇసుక భవన నిర్మాణదారులకు టన్ను రూ.1600 నుంచి రూ.2వేలకు లభిస్తుంది. దీంతో ఆ యజమానులు నిర్మాణాలను నిలిపివేయటం, వాయిదా వేయటం చేయటంలో ఆ విభాగంపై ఆధారపడ్డ కార్మికులకు పని దొరకటం కష్టంగా మారింది. ప్రస్తుతం 20 టన్నుల లారీ రూ.30వేలకు పైగా పెట్టాల్సివస్తుందని భవన నిర్మాణ దారులు వాపోతున్నారు. పట్టణంతో పాటు చుట్టుపక్కల పదుల సంఖ్యలో అపార్టుమెంట్లు, ఇళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మాణంలో ఉన్నాయి. వాటిలో పనికోసం ప్రతిరోజూ నరసరావుపేట నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన వారితో పాటు చుట్టుపక్కల ఉన్న చిలకలూరిపేట, సత్తెనపల్లి నియోజకవర్గాలని పలు గ్రామాల నుంచి నరసరావుపేటలోని మల్లమ్మసెంటర్‌కు చేరుతుంటారు. యజమానులు, మేస్త్రీలు ఈ సెంటర్‌కు వచ్చి తమకు కావాల్సిన కూలీలను తీసుకెళుతుంటారు. ప్రస్తుతం కేవలం పదిశాతం మందికే పని దొరుకుతుందని కార్మికులు చెబుతున్నారు. ప్రభుత్వాధికారులు ఇసుకకు ఢోకాలేదని, కావాల్సినంత ఇసుక లభిస్తుందని ప్రకటించారు. అయితే కూలీలకు మాత్రం పని దొరకటం లేదు.



ప్రకాష్‌నగర్‌లో ఓ నిర్మాణంలో ఉన్న ఇంటివద్ద టన్ను రూ.1600కు తోలిన ఇసుక

## పనులన్నీ ఆగిపోయాయి



నాకు నిర్మాణ రంగంలో 42ఏళ్ల అనుభవం ఉంది. ప్రస్తుతం బేల్దారీ మేస్త్రిగా పనిచేస్తున్నా. యూనియన్ కార్యవర్గంలో కూడా పని చేశా. ప్రస్తు తం ఖాళీగా ఉన్నా. ఇసుక దొరక్క ఇళ్ల యజమానులు అందరూ పనులు ఆపేశారు. మాకు కూడా పని లేకుండా పోయింది. పిలిచే వారే కరువయ్యారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

– పి.వెంకటేశ్వర్లు, బేల్దారీ మేస్త్రి, వెంగళరెడ్డి నగర్, నరసరావుపేట

## ఈ ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి పనిలేదు



ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి సక్రమంగా పని దొరకటం లేదు. నెలకు ఐదారురోజుల మించి దొరకలేదు. నెలరోజుల నుంచి అసలు పనికి పిలిచేవారే లేరు. నిత్యావసరాలు పెరిగిపోయాయి. రూ.90 ఉన్న పామాయిల్ రూ.120 అయింది.

–ఎస్.బ్రహ్మం, బేల్దారీ మేస్త్రి, 33వ వార్డు, నరసరావుపేట

## నెల నుంచి పని దొరకడం లేదు



నాకు నెలరోజుల నుంచి పని దొరకటంలేదు. నాలుగు నెలలుగా సక్రమంగా ఏరోజూ పని దొరికి ఎరుగదు. ప్రతిరోజూ రావటం ఖాళీచేతులతో ఇంటికెళ్లటం. ఈ విధంగానైతే ఎలాగయ్యా అంటూ నా భార్య అడుగుతుంది(కన్నీళ్లు పెట్టుకున్నాడు). నాకు ముగ్గురు పిల్లలు కాగా, అందులో ఒకడు కామెర్లు రోగంతో బాధపడుతున్నాడు. నా భార్య ఇళ్లల్లో పనికి వెళ్లి కుటుంబాన్ని నడుపుతుంది. నేను పనిచేసి కుటుంబాన్ని ఆదుకుందామన్నా పనిదొరకటంలేదు.

– కోటయ్య, భవన నిర్మాణ కూలీ, లింగంగుంట్ల కాలనీ, నరసరావుపేట

## కరోనా సమయంలో కూడా పని దొరికింది



కరోనా సమయంలో కూడా పనిదొరికింది. కానీ ఇప్పుడు మాత్రం పనికి పిలిచే వారే లేరు. ఇసుక దొరకటం కష్టంగా మారింది. బేల్దారీ మేస్త్రికి రూ.900 కూలి ఇస్తారు. రూ.600లకు పనిచేద్దామన్నా కూడా పిలిచేవారే లేరు.

– షేక్ బాషు, బేల్దారీ మేస్త్రి, రావిపాడు, నరసరావుపేట మండలం

## టన్ను రూ.2వేలు పెట్టి కొనుక్కెళుతున్నా..



గత ఆర్నెళ్ల నుంచి ఇంటి నిర్మాణం చేపట్టా. బండ పరుపుకోసం ఇసుక కావాల్సివచ్చింది. ఇసుక దొరక్క మూడువారాలుగా పని ఆపేశా. ఇప్పుడు మారు బేరగాడి వద్ద టన్ను రూ.2వేలకు కొనుక్కొని తీసుకెళుతున్నా. గతంలో ఎన్నడూ ఇంత ధరలేదు. ఇసుక ఫ్రీ అని చెబుతూ అత్యంత ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు.

– హనుమంతరావు, ఇంటియజమాని, బరంపేట

## క్లుప్తంగా

### పెట్రోలు బంకు పనులు సత్వరమే పూర్తి చేస్తాం

**శావల్యాపురం:** మండలంలోని గుంటుపాలెం గ్రామ సమీపంలో ప్రధాన రహదారి వెంబడి ఏర్పాటు చేస్తున్న పెట్రోలు బంకు పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని కారుమంచి సొసైటీ సీఈఓ వైవీ నారాయణ తెలిపారు. గురువారం మండలంలోని కారుమంచి సొసైటీ కార్యాలయంలో సీఈఓ మాట్లాడుతూ జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు సొసైటీ బ్యాంకు ఉన్నతాధికారుల అనుమతి ద్వారా సివిల్ సప్లయిస్ అధికారుల అనుమతి ధ్రువీకరణ పత్రం, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పనులను రోజుల వ్యవధిలో పూర్తి చేస్తామన్నారు.

### పంచాయతీ పాలనపై శిక్షణ

**వినుకొండ(నూజెండ్ల):** పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లకు డేస్ రెప్రెషర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పి. పుట్టారెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీ సాధారణ పరిపాలన, ఆదాయ వనరుల సమీకరణ, పారిశుద్ధ్యం, తాగునీరు సరఫరా, భవన నిర్మాణం, లేఅవుట్స్ వంటి పలు అంశాల గురించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జి.సుందరరెడ్డి, మండల రిసోర్స్ కో–ఆర్డినేటర్ ప్రభాకరరావు, పంచాయతీల ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

### డీటీ అర్జున్‌నాయక్ బాధ్యతల స్వీకారం



**బొల్లాపల్లి:** మండల డిప్యూటీ తహసీల్దార్‌గా ఎం.అర్జున్‌నాయక్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. నూజెండ్ల మండలం డీటీగా విధులు నిర్వహిస్తూ బొల్లాపల్లికి బదిలీపై వచ్చారు. ఈ మేరకు తహసీల్దార్ ఏవీ సుధాకర్ తెలిపారు. మండల డీటీ పోస్టు కొంతకాలంగా భర్తీ చేయకపోవడంతో అర్జున్‌నాయక్ రాకతో డీటీ పోస్టు భర్తీ అయింది. గరికపాడు వీఆర్వోగా బి.వెంకయ్య, అయ్యన్నపాలెం వీఆర్వోగా బాలమురళి విధుల్లో చేరారు. వీరు ఈపూరు మండలం నుంచి బొల్లాపల్లి మండలానికి బదిలీ అయ్యారు.

### రాష్ట్రస్థాయి స్కేటింగ్‌కు ఎంపిక



**వినుకొండ(నూజెండ్ల):** పట్టణంలోని చాణిక్య స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోచ్ శర్మ మాట్లాడుతూ స్కేటింగ్ క్రీడా విభాగంలో రాష్ట్రస్థాయికి అకాడమీ నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఇటీవల మంగళగిరిలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీల్లో ఎనిమిది మంది పాల్గొనగా నలుగురు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు తనీష్, మహమ్మద్, పవన్, వెంకట్‌రెడ్డిలను, వారి తల్లిదండ్రులను అకాడమీ తరఫున అభినందించారు. అకాడమీ డైరెక్టర్ కంచర్ల నాగార్జున, ఎస్‌కే అబ్దుల్ బాషా, ఎం.శర్మ తదితరులు పాల్గొన్నారు.

### మొక్కల పెంపకంపై అవగాహన

**ఈపూరు:** అటవీయేతర ప్రాంతంలో మొక్కల పెంపకం కార్యక్రమంలో భాగంగా మండలలోని అగ్నిగుండాల గ్రామంలో రైతులకు గురువారం అవగాహన, శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఆగ్రో ఫారెస్ట్రీ ఎలా చేయాలి, ఉద్యానవన మొక్కలు, అడవిజాతి మొక్కలను వ్యవసాయ భూమిలో నాటితే దాని వల్ల వచ్చే ఉపయోగాలను, అదనపు ఆదాయం గురించి శిక్షణ ఇచ్చారు. ట్రీస్ ఔట్‌సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా ప్రోగ్రాం సీసీ వెంకటేష్, వీహెచ్‌పీ జి.జితేంద్ర నాగరాజు, తిరుమలశెట్టి బాలయ్య, సీసీ అనిల్, మణికంఠ, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

### విద్యుత్‌శాఖ తనిఖీలు

**నరసరావుపేట రూరల్:** విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగం ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న, అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్న 202 మందికి రూ.8.85లక్షల అపరాధ రుసుము విధించినట్టు జిల్లా పర్యవేక్షక ఇంజినీర్ డాక్టర్ పి.వి జయకుమార్ తెలిపారు. మండలంలోని దొండపాడు, గోనెపూడి, కాకాని, కేసానుపల్లి, చింతలపాలెం, రావిపాడు, ఉప్పలపాడు, బసికాపురం గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. డీపీఈ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సిహెచ్ రాంబోట్లు ఆధ్వర్యంలో 50 మంది అధికారులు, 150 మంది సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు. మీటరు లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరికి రూ.వెయ్యి, మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న ఒకరికి రూ.4వేలు, అనుమతించిన కేటగిరి కాకుండా ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుతున్న ఒకరికి రూ.5వేలు, అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 198మందికి రూ.8.75లక్షలు అపరాధ రుసుం విధించారు. తనిఖీల్లో డీఈఈలు కె.రవికుమార్, జీఎల్‌వీ ప్రసాద్‌రావు, ఆపరేషన్ ఏఈ పి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## మంజూరైన పనులన్నీ పూర్తి చేయాలి



**శావల్యాపురం:** పల్లె పండుగ – పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, మినీ గోకులం షెడ్లు ఈనెల 14 నుంచి 20 లోపు పనులు ప్రారంభించాలని ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గోకులం షెడ్లు మంజూరైన లబ్ధిదారులు, సచివాలయ ఉద్యోగుల, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్నీ గ్రామపంచాయతీల్లో జరగనున్న పనులన్నీ నూరుశాతం పారదర్శకంగా పూర్తయ్యేలా ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. 20 పనులకుగాను రూ. 2 కోట్ల 50 లక్షలు నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఈఓపీఆర్‌డీ పి.సుగుణ, ఏపీఓ కె.రామారావు పాల్గొన్నారు.

## రతన్‌టాటా మృతి దేశానికి తీరని నష్టం

**నరసరావుపేట:** జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం డీసీసీ అధ్యక్షుడు గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ రతన్‌టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతానికి రతన్‌టాటా కృషి చేశారన్నారు. ఆయన మృతి దేశానికి తీరని నష్టమన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్ఎం బాష, సీతాకృష్ణ, ఇమ్మానుయేల్ పాల్గొన్నారు.

## దేశం గర్వించదగ్గ వ్యక్తి రతన్‌టాటా

### మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



**నరసరావుపేట:** దేశం గర్వించదగ్గ వ్యక్తి రతన్‌టాటా అని, ఆయన మరణం దిగ్భ్రాంతి కలిగించిందని మాజీ శాసన సభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రతన్ టాటా మరణం చాలా బాధాకరం అన్నారు. రెండు రోజుల క్రితం హాస్పిటల్‌కి వెళుతూ తాను ఆరోగ్యంగా ఉన్నాను, తిరిగి ఇంటికి వస్తానని మాట్లాడిన మాటలు వింటే నిజంగా ఆయన కోలుకొని ఇంటికి వస్తారని భావించామన్నారు. 87 ఏళ్ల వయస్సులో ఇప్పటికీ ఎంతో యాక్టివ్‌గా పనిచేస్తూ, టాటా గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌లో సుమారు ఎనిమిది లక్షల మంది ఉద్యోగస్తులకు ఉపాధి కల్పిస్తునారన్నారు. ఉప్పు, టీ పొడి మ్యానుఫ్యాక్చరింగ్ దగ్గరనుంచి విమానయాన సంస్థల వరకు నిర్వహిస్తూ ఎయిర్ ఇండియా సంస్థను ఈరోజు ఆపరేట్‌చేసే స్థాయికి ఎదిగిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. టాటాలు దేశాభివృద్ధి కోసం వ్యాపార సంస్థలు ఏర్పాటుచేశారన్నారు. అలాగే పేద, మధ్య తరగతి వర్గీయులకోసం చిన్న కారు నానో నుంచి లగ్జరీ కారు వరకు టాటా సంస్థ మ్యానుఫ్యాక్చరింగ్ చేస్తుందన్నారు. ప్రతి ఇంట్లో టాటాకు సంబంధించిన ఏదో ఒక వస్తువుంటుందన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలు చాలా గొప్పవన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఐసీఐసీఐ బ్యాంకు బాధితులకు న్యాయం చేయాలి



బ్యాంకు ముందు ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

**చిలకలూరిపేట:** ఐసీఐసీఐ బ్యాంకు బాధితులకు న్యాయం చేయాలని ఏఐఎస్ఎఫ్ ఇన్‌చార్జి బి.భగత్ సింగ్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బ్యాంకు ముందు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయలు బ్యాంకులో దాచుకున్న ఖాతాదారులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్లుగా బ్యాంకు సిబ్బంది అవకతవకలకు పాల్పడుతున్నా బ్యాంకు ఉన్నతాధికారులు కళ్లు మూసుకొని నిద్ర నటించటం ఏమిటని ప్రశ్నించారు. పొలాలు అమ్మి, స్థలాలు అమ్మి, బ్యాంకులో డిపాజిట్లు చేసుకున్నవారిని బ్యాంకు సిబ్బందే మోసగించటం దారుణమన్నారు. పలువురికి నకిలీ డిపాజిట్ సర్టిఫికెట్లు ఇచ్చిన నేపథ్యంలో అలాంటి ఖాతాదారులంతా తమ డబ్బులు వస్తాయో రావో అన్న ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రజలు వ్యక్తులను కాదని, బ్యాంకును నమ్మి డిపాజిట్లు చేసిన నేపథ్యంలో బ్యాంకు పూర్తిస్థాయిలో బాధ్యత వహించి ఖాతాదారులకు పూర్తిగా న్యాయం చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ



బోయపాలెంలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

**నాదెండ్ల:** రాష్ట్రవ్యాప్తంగా రహదారుల మరమ్మతులు, నూతన రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. యడ్లపాడు మండలంలో సంగంగోపాలపురం–బోయపాలెం మధ్య ఆర్అండ్‌బీ నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల వరకూ సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో నిర్మించిన గురుకుల పాఠశాలలో వివిధ ప్రాంతాలకు చెందిన వెయ్యి మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని, వీరి సౌకర్యార్థం రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులు చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్నారు. ఇటీవల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల తీరు నచ్చక విద్యార్థులు పాఠశాల నుండి బయటకు పరారవటం శోచనీయమన్నారు. విద్యార్థులకు సమస్యలు లేకుండా నాణ్యమైన విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పౌరసరఫరాల గోదాములో జేసీ తనిఖీలు



కందిపప్పు, పంచదార ప్యాకెట్లను పరిశీలిస్తున్న జేసీ గనోరే

**నరసరావుపేట:** స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పౌరసరఫరాల మండల స్థాయి స్టాక్ పాయింట్ (ఎంఎల్ఎస్)ను జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజాపంపిణీ కోసం నిల్వ ఉంచిన బియ్యం, కందిపప్పు, పామాయిల్ నిల్వలను పరిశీలించారు. స్టాక్ రికార్డులు పరిశీలించి ఆన్‌లైన్‌లో సరిపోతున్నాయో లేదో తనిఖీ చేశారు. తూకం వేసే కాటాల పనితీరు, పంచదార, కందిపప్పు పాకెట్ల తూకం వేయించి అవి నిర్దేశించిన తూకంలో ఉన్నాయో లేదో పరిశీలించారు. చౌక ధరల దుకాణాలకు స్టాక్ చేరిందా లేదా అనేది వివరాలను పాయింట్ ఇన్‌చార్జిని అడిగి తెలుసుకున్నారు. గోదాములో సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ పి.సుశీల ఉన్నారు.

## పని ప్రదేశంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు

**నరసరావుపేట:** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం పని ప్రదేశంలో మానసిక ఆరోగ్యం ప్రాధాన్యత గురించి పల్నాడు రోడ్డులోని ఏరియా హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి ముఖ్య అతిథిగా పాల్గొని మానసిక ఆరోగ్యం విశిష్టతను వివరించారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.మంత్రునాయక్ మాట్లాడుతూ పనిచేస్తున్న ప్రదేశం వద్ద ఒత్తిడిని ఎదుర్కొని, జయించేందుకు అవసరమైన చిట్కాలు తెలియచేశారు. ఆర్ఎంఒలు డాక్టర్ దయానిధి, డాక్టర్ ఏడుకొండలు, మానసిక వైద్యులు డాక్టర్ పార్థసారథి, డాక్టర్ సతీష్, జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమ బృంద వైద్యులు డాక్టర్ పవిత్ర, ఉద్యోగులు, రోగులు, సహాయకులు పాల్గొన్నారు

## 101బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



**రొంపిచర్ల:** మండలంలోని మాచవరం గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రొంపిచర్ల పోలీసులు పట్టుకున్నారు. గ్రామం నుంచి 101 బస్తాల బియ్యాన్ని మినీ లారీలో తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. మినీ లారీతో పాటు వ్యాపారి, డ్రైవర్ రామాంజనేయులును పట్టుకొని రొంపిచర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



**రొంపిచర్ల:** మండలంలోని విప్పర్ల గ్రామ సమీపంలో శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ వేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి చెన్నైకు దుస్తులు, సరుకుల లోడ్‌తో వెళ్తున్న పార్సిల్ లారీ విప్పర్ల సమీపంలోకి రాగానే అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న మంచినీటి పథకం ప్రహరీని ఢీకొట్టింది. ఈ సంఘటనలో లారీ ముందు భాగం దెబ్బతింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

## కార్మికుల తొలగింపు అన్యాయం

**నరసరావుపేట:** మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగంలో ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా పనిచేస్తున్న వారిపై కక్షపూరిత చర్యలను విరమించాలని భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఐక్య పల్నాడు జిల్లా కార్యదర్శి రెడ్ బాష కోరారు. గత కొన్నిరోజులుగా తమను విధుల్లోకి తీసుకోవాలంటూ కార్మికులు చేస్తున్న నిరసన దీక్షా శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నియామకం చేశారనే కక్షతో తెలుగుదేశం ప్రభుత్వంలో వారిని తొలగించి కొత్తవారిని పెట్టుకోవాలనే దురాలోచన విరమించుకోవాలని అన్నారు. ఆగస్టు ఒకటవ నుంచి వారిని మున్సిపల్ కమిషనర్ విధులనుంచి తొలగించారని, మళ్లీ విధుల్లోకి తీసుకొని వారికి రావలసిన జీతభత్యాలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సీఐటీయూ నాయకులు శిలార్ మసూద్, డి.శివకుమారి, అల్లాభక్షు పాల్గొన్నారు.



నాదెండ్ల శాంతినగర్‌లో దుర్గాదేవిగా అమ్మవారు



శావల్యాపురంలో శ్రీదుర్గాదేవిగా కనకదుర్గ



విప్పర్లలో దుర్గమ్మ అలంకారంలో కామాక్షి అమ్మవారు



దుర్గామాత అలంకరణలో విజయ చాముండేశ్వరి



రవ్వవరం జగన్మాత పీఠంలో దుర్గాదేవి అవతారంలో ..



దుర్గామాత అలంకరణలో చౌడేశ్వరీ అమ్మవారు

## దుర్గామాత శరణు.. శరణు!

శ్రీ దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా గురువారం వివిధ ఆలయాల్లోని అమ్మవారు దుర్గామాతగా దర్శనమిచ్చారు. భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– నరసరావుపేట ఈస్ట్,నాదెండ్ల,బొల్లాపల్లి , వినుకొండ(నూజెండ్ల), శావల్యాపురం, రొంపిచర్ల



శ్రీశంకర సత్సంగంలో కుంకుమర్చన పూజలు



నాదెండ్ల శివప్రియనగర్ ఆదిపరాశక్తి క్షేత్రంలో..



దుర్గామాత అలంకరణలో పాతూరు శివాలయం పార్వతీ అమ్మవారు



వడ్డెంగుంటలో దుర్గాదేవి అలంకారంలో జ్ఞానప్రసూనాంబ

## ఉపాధి పథకంలో గ్రామాలను అభివృద్ధి చేసుకోండి

### వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

**బొల్లాపల్లి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సమావేశం గురువారం నిర్వహించారు. సభ్యులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. గతంలో చేసిన పనులకు వెంటనే బిల్లులు చెల్లించాలని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కరెంటు సమస్యల గురించి చర్చించారు. అనంతరం సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా మండలాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకంలో గ్రామాల అభివృద్ధికి నిధులు ఉన్నాయని, సీసీ రోడ్లు, సైడ్ కాలువల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఎంపీపీ బత్తి రాములు, వైస్ ఎంపీపీ బి.మరియమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తహసీల్దార్ ఏవీ సుధాకర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీబాషా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక



విద్యార్థులతో పాఠశాల హెచ్ఎం పార్వతి, పీఈటీ రూన్సీరాణి

**నరసరావుపేటరూరల్:** జాతీయ స్థాయి ఆట్యాపాట్యా పోటీలకు శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఏడుగురు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి తెలిపారు. బాలుర జట్టుకు బి.వరప్రసాదరెడ్డి, టి.మణిదీప్, పి.త్రివిక్రమ్‌రెడ్డి, డి.అరవింద్, బాలికల జట్టుకు షేక్ సుహానా మస్తాని, కె.వైష్ణవి, పి.రాజశ్రీలు ఎంపికైనట్టు వివరించారు. ఈనెల 11,12,13 తేదీల్లో పాండిచేరిలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలలో ఏడుగురు విద్యార్థులు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం పార్వతి, వ్యాయామ ఉపాధ్యాయులు జి.రూన్సీరాణి, షేక్ ఫాతిమా, పి.తిరుపతిరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.